సాక్షి
కృష్ణాజిల్లా
మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



కలెక్టర్‌తో 'ఎన్జీవో' నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీని సోమవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కృష్ణాజిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



దీపక్‌మిశ్రాకు స్వాగతం

గన్నవరం: రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలకులు దీపక్‌మిశ్రా సోమవారం గన్నవరం విమానాశ్రయానికి రాగా.. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ స్వాగతం పలికారు.



కొత్త ఉషస్సు

శ్రీ క్రోధి నామ సంవత్సరాదిని ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ముందస్తుగానే ఉగాది పచ్చడి చేసుకొని ఒకరికొకరు తినిపించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
విజయవాడ	6.27	4.38
జగ్గయ్యపేట	6.29	4.43
మచిలీపట్నం	6.26	4.35
గుడివాడ	6.27	4.38

న్యూస్‌రీల్

క్రీడాకారులకు ఉగాది పురస్కారాల ప్రదానం



విజయవాడస్పోర్ట్స్: జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లా కీర్తిని చాటుతున్న క్రీడాకారుల సేవలను జెన్‌కో అడిషనల్ ఎస్పీ మెహర్‌బాబు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కిషోర్ రాయల్ కొనియాడారు. గ్లోబల్ స్పోర్ట్స్ అకాడమీ, స్టార్ టెన్నిస్ అకాడమీ ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 30 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను సోమవారం ఉగాది పురస్కారాలతో సత్కరించాయి. విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎస్పీ మెహర్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ కిషోర్‌రాయల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించడం సులభం కాదన్నారు. అకుంఠిత దీక్షతో కష్టపడి ఆ స్థాయి ఎదిగిన క్రీడాకారులకు గౌరవించడం మన బాధ్యత అని గుర్తు చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) రిటైర్డ్ కోచ్ రాజేంద్రప్రసాద్, జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు రామ్‌కుమార్, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్, స్టార్ టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ కె.డోలగోపాలరావు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కార్యకలాపాలు సజావుగా సాగాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ, సోషల్ మీడియా సెల్ కార్యకలాపాలను సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. రాజకీయ ప్రకటనలకు ఇచ్చే సర్టిఫికేషన్, వివిధ మాధ్యమాల్లో ప్రచురితమైన, ప్రసారమైన వార్తలు, కథనాలపై వచ్చే ఫిర్యాదుల పరిశీలన, పరిష్కారం తదితరాలకు సంబంధించి కమిటీ చేపడుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున వివిధ వార్తా చానళ్లలో వస్తున్న వార్తలు, కథనాల పర్యవేక్షణకు చేసిన ఏర్పాట్లను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు, మరి కొన్ని రైళ్లను దారి మళ్లించనున్నట్లు విజయవాడ డివిజన్ రైల్వే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మండ్‌రూప్‌కర్ సామవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ – గుంటూరు మధ్య నడిచే 07464, 07465, 07976 నంబర్ రైళ్లను ఈ నెల పది నుంచి 30వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేశామని తెలిపారు. హుబ్లీ నుంచి విజయవాడ వచ్చే 17329 నంబర్ రైలు ఈ నెల 9 నుంచి 29వ తేదీ వరకు గుంటూరు వరకే నడుస్తుందని పేర్కొన్నారు. విజయవాడ – హుబ్లీ మధ్య నడిచే 17330 నంబర్ రైలు ఈ నెల పది నుంచి 30వ తేదీ వరకు గుంటూరు నుంచి బయలుదేరుతుందని తెలిపారు. చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడ వచ్చే 12077 నంబర్ రైలు ఈ నెల పది నుంచి 30వ తేదీ వరకు మంగళవారం మినహా మిగతా రోజుల్లో తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. చెన్నయ్ సెంట్రల్ ఎస్‌వీడీ కత్రాల మధ్య నడిచే 16031 నంబర్ రైలు పదో తేదీ నుంచి 28వ తేదీ వరకు, చెన్నై సెంట్రల్– లక్నో మధ్య నడిచే 16093 నంబర్ రైలు 13 నుంచి 30వ తేదీ వరకు తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా నడుస్తాయని వివరించారు. విశాఖపట్నం–లింగంపల్లి మధ్య నడిచే 12805(జన్మభూమి) నంబర్ రైలు ఈనెల 9, 12, 13,15,16 తేదీల్లో 45 నిమిషాలు ఆలస్యంగా ఉదయం 7.05 బయలుదేరుతుందని తెలిపారు.

నోటా.. తూటా!

ఫలితాలను తారుమారు చేసే తిరస్క'రణం' ఇది

- గెలుపోటములు శాసించే ఆయుధంగా మారిన నోటా
- అభ్యర్థుల తలరాత మారుస్తున్న వైనం
- ఎన్నికల బరిలో నిలిచిన వారు నచ్చకపోతే ఇదే ఆప్షన్
- 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకి 24వేల ఓట్లు



సాక్షి, మచిలీపట్నం: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తల రాతలను నోటా మారుస్తోంది. పోటీ చేసే వారిలో ఎవరూ నచ్చకపోతే 'నన్ ఆఫ్ ది అబోవ్' అనే ఆప్షన్ బటన్ నొక్కుతున్నారు. అయితే, ఇది అభ్యర్థుల్లో టెన్షన్ పుట్టిస్తోంది. ప్రజా సేవ చేయాలనో.. అసెంబ్లీలో అడుగుపెట్టి ప్రజావాణి వినిపించాలనో బరిలో నిలిచే నేతల 'నోటా' మాట లేకుండా చేస్తోంది. ఇలా ఎంతో మంది భవిష్యత్తును తారుమారు చేస్తోంది నోటా. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో నోటాకి 24వేల ఓట్లకు పైగా పడ్డాయి.

నచ్చకపోతే 'నోటా'..

ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా (నన్ ఆఫ్ ది ఎబవ్)ను ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఓటు వేయాలంటే సదరు అభ్యర్థికో, పార్టీకో ఓ గుర్తు ఉంటుంది. ఆ గుర్తుకు ఓటర్లు ఓటు వేస్తూ ఉంటారు. అయితే, బరిలో ఉన్న నాయకులు నచ్చలేదనే ఆలోచన ఉన్న ఓటర్ల కోసం నోటా ఆప్షన్‌ను ఈవీఎంలలో పొందుపరిచారు.

హక్కు దుర్వినియోగం కాకుండా..


ఎన్నికల బరిలో నిలిచిన వారిలో ఎవరూ నచ్చకపోయినా ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేస్తున్నారు. కొన్ని సార్లు వాస్తవ ఓటర్లు ఓటు వేసేందుకు రాకపోతే దుర్వినియోగం అయ్యే అవకాశాలు ఉన్నాయని గుర్తించారు. దీంతో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటా ద్వారా తమ తీర్పును వెల్లడించే అవకాశం కల్పించారు. నోటా బటన్ నొక్కితే ఓటరు ఓటు ఎవరికీ పడదు. కానీ ఓటు హక్కు మాత్రం వినియోగించుకున్నట్లు అవుతుంది.

2009లో తెరపైకి..

నోటా అవకాశం ఇప్పటికే చాలా దేశాల్లో ఓటర్లకు అందుబాటులో ఉంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌లో 'నోటా'ను అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు ఎన్నికల కమిషన్ 2009లో తొలిసారిగా సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రభుత్వం వ్యతిరేకించినా, పౌర హక్కుల సంస్థ పీయూసీఎల్ దీనికి మద్దతుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఎట్టకేలకు ఎన్నికల్లో 'నోటా'ను అమలులోకి తేవాలంటూ సుప్రీం కోర్టు 2013 సెప్టెంబర్ 27న రూలింగ్ ఇచ్చింది. ఒకవేళ ఆ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులకు పడిన ఓట్లకన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పడితే ఆ నియోజకవర్గం నుంచి తిరిగి ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వవలసి ఉంటుంది.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు పడిన ఓట్లు..

నియోజకవర్గం పేరు	నోటాకు వేసిన ఓట్లు
గన్నవరం	1,818
గుడివాడ	3,285
పెడన	1,407
మచిలీపట్నం	1,258
అవనిగడ్డ	1,778
పామర్రు	1,934
పెనమలూరు	1,550
తిరువూరు	1,746
నూజివీడు	2,244
కైకలూరు	1,526
విజయవాడ వెస్ట్	769
విజయవాడ సెంట్రల్	1,012
విజయవాడ ఈస్ట్	1,061
మైలవరం	814
నందిగామ	1,023
జగ్గయ్యపేట	1,038
మొత్తం	24,263



ఈవీఎంలో నోటా బటన్

వసంత వేడుక.. కమనీయ వేదిక



దుర్గ గుడి ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు

- ఉదయం 9 గంటల తర్వాత అమ్మవారి దర్శనం
- విశేష పుష్పార్చనకు ఏర్పాట్లు
- ఆలయ ప్రాంగణంలో ఉగాది వేడుకలు
- నేడు భక్తుల కోసం 8 ఉచిత బస్సు సర్వీసులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై క్రోధి నామ సంవత్సర వేడుకలు, వసంత నవరాత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, విశేష అలంకరణ, నిత్య పూజల అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మరో వైపున వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పుష్పాలతో విశేష అర్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి ఈ విశేష పుష్పార్చన నిర్వహిస్తారు. పుష్పార్చన అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు పుష్పాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు రాజగోపురం ఎదుట ధర్మపథం వేదికపై పంచాంగ శ్రవణం జరుగుతుంది. తెల్లవారుజామున జరిగే పలు ఆర్జిత సేవలను దేవస్థానం రద్దు చేయగా, ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం అరగంట ఆలస్యంగా ప్రారంభమవుతాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించే వెండి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

నేడు బస్సు సర్వీసులు ఉచితం..

ఉగాది పర్వదినం, వసంత నవరాత్రోత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సౌలభ్యం కోసం దేవస్థానం 8 ఉచిత బస్సు సర్వీసులను నడుపుతుంది. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు తమ వాహనాలను వీఎంసీ కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో నిలుపుకుని అక్కడి నుంచి దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకోవాలని సూచిస్తుంది. మరో వైపున బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల నుంచి నాలుగు సర్వీసులు, పున్నమీఘాట్ నుంచి రెండు సర్వీసులు, దుర్గాఘాట్ నుంచి కొండపైకి మరో రెండు సర్వీసులను నడుపుతోంది. ఈ ఎనిమిది బస్సులలో భక్తులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

వీఐపీ దర్శనాలు రద్దు..

అమ్మవారికి మహా నివేదన సమయంలో వీఐపీ దర్శనాలను నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ ఈవో కేఎస్ రామరావు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు వీఐపీలతో పాటు అన్ని ప్రోటోకాల్, డిపార్ట్‌మెంట్, వృద్ధులు, వికలాంగులకు దర్శనాలు నిలిపివేసింది. అమ్మవారికి ప్రతి నిత్యం మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన సమర్పిస్తారు. ఉదయం 11.40 నుంచి 12.15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో క్యూలైన్‌లో భక్తుల రద్దీ పెరుగుతుంది. సామాన్య భక్తులు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు దేవస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత వీఐపీ దర్శనాలు తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొంది.

జనసేన జెండా పీకేశారు

- బెజవాడ జనసేన పార్టీలో ముసలం
- పార్టీకి పోతిన మహేష్ రాజీనామా
- పవన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు
- పార్టీ కార్యాలయంలో జెండాలు, బ్యానర్లు దగ్ధం
- పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పవన్ తీరుపై పార్టీ నాయకుల ఆగ్రహం



జనసేన జెండాలు, ఫ్లెక్సీలను తగలబెడుతున్న ఆ పార్టీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జనసేన పార్టీలో ముసలం పుట్టింది. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, విజయవాడ నగర అధ్యక్షుడు పోతిన మహేష్ పార్టీ బాధ్యతలు, క్రియాశీలక సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. పవన్‌కల్యాణ్ తీరును నిరసిస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో బ్యానర్లు, జెండాలను తగలబెట్టారు. పవన్‌ది అంతా నటన అని, తన స్వార్థం కోసమే పార్టీ పెట్టాడని పోతిన మహేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. త్యాగాలకు బీసీలు కావాలా? కమ్మ సామాజికవర్గం అందుకు పనికిరాదా అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో కలకలం రేపుతున్నాయి. పవన్ సిద్ధాంతాలు అన్నీ స్వార్థపూరితమని, పార్టీ కోసం కష్టపడిన వారిని నట్టేట ముంచారని, కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని చేసిన విమర్శలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. టీడీపీ కోసమే జనసేన పార్టీ పెట్టారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రోడ్డునపడ్డ కుటుంబాలు..

పదేళ్లపాటు బెజవాడలో పోతిన మహేష్ జనసేన పార్టీ జెండా మోశారు. పార్టీ కోసం, పవన్‌కల్యాణ్ బెజవాడలో చేపట్టిన ప్రతికార్యక్రమానికి డబ్బు ఖర్చు చేశారు. రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులు పోగొట్టుకున్నారు. జనసేన పార్టీ జెండా మోసిన పలు కుటుంబాలు రోడ్డునపడ్డాయి. పవన్‌కు డబ్బు మూటలు అందగానే ప్లేటు ఫిరాయించి, పోతినకు హామీ ఇచ్చిన విజయవాడ పశ్చిమ సీటును బీజేపీకి చెందిన సుజనా చౌదరికి కేటాయించారు. ఈ పరిణామం బీసీలు, జనసేన కార్యకర్తలను ఆలోచింపజేసింది.

టీడీపీ నేతకు అవనిగడ్డ సీటు..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో పొత్తులో భాగంగా దక్కిన ఒకేఒక్క అవనిగడ్డ సీటును టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడాన్ని జనసేన నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీతో కలిసి పనిచేసేందుకు జనసేన కార్యకర్తలు ససేమిరా అంటున్నారు. ప్రజారాజ్యం పార్టీని భూస్థాపితం చేసి చిరంజీవిని క్షోభకు గురిచేసి, రాజకీయంగా తప్పుకొనేలా చేసిన ఘటనలు తలచుకొంటున్నారు. వంగవీటి రంగా ఉదంతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మోసానికి కేరాఫ్ అడ్రస్ అని, తేనె పూసిన కత్తిలాంటి వాడనే భావన కాపుల్లో వ్యక్తమవుతోంది. పార్టీ కోసం కష్టపడిన వారిని పవన్ కల్యాణ్ దారుణంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఎన్నికల తరువాత తమ పార్టీ టీడీపీలో కలిసిపోతుందనే చర్చ ప్రస్తుతం జనసేన పార్టీలోనే సాగుతోంది. చంద్రబాబు నాయుడు కేవలం కాపుల ఓట్లకోసమే పవన్‌కల్యాణ్‌తో పార్టీ పెట్టించి నాటకం ఆడిస్తున్నారనే అనుమానం పలువురిలో వ్యక్తమవుతోంది.

ఇప్పటికే పలువురు నేతలు దూరం

గత ఎన్నికల్లో జనసేన తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసిన బత్తిన రాము ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. జనసేన జిల్లా ప్రచార కమిటీ కార్యక్రమాల సమన్వయకర్త యడవల్లి సతీష్‌తో పాటు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు దేవినేని అవినాష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పెనమలూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పెడన టికెట్‌ను టీడీపీకి కేటాయించడంపై జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ టీడీపీకి కోవర్టుగా పనిచేస్తున్నారని ఆయన దిష్టిబొమ్మను తగలబెట్టారు. పెడనలో జనసేన నాయకుడు సమ్మిట బాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అవనిగడ్డ సీటు టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే జనసేన పదవులకు జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, జిల్లా సమన్వయకర్త చెన్నగిరి సత్యనారాయణ, అవనిగడ్డ టౌన్ ప్రధాన కార్యదర్శి సహా పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు రాజీనామా చేశారు.

అవనిగడ్డలో ఇండిపెండెంట్‌గా పోటీ!

46 శాతం ఓట్లున్న టీడీపీని వీడి ఆరు శాతం ఓట్లున్న జనసేనలోకి తాను ఎందుకు వస్తానని గతంలో వ్యాఖ్యానించిన మండలి బుద్ధప్రసాద్ ఇప్పుడు ఎందుకు పార్టీ మారారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అవనిగడ్డ నుంచి జనసేన టిక్కెట్ ఆశించిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో సమావేశం అయ్యేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తం మీద ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలువురు నాయకులు ఇప్పటికే జనసేన పార్టీకి రాంరాం చెప్పారు. మరికొంత మంది పార్టీని వీడేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందే జనసేన కూటమి పుట్టి మునగడం ఖాయం అని విశ్లేషకులు సైతం భావిస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ




కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల అధికారులకు సూచిలిస్తున్న కలెక్టర్ బాలాజీ

కోనేరు సెంటర్(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ పలు శాఖల అధికారులతో కలిసి కృష్ణా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లు కౌంటింగ్ హాళ్ల ఏర్పాట్లు పరిశీలించారు. ముఖ్యంగా పోలింగ్ అనంతరం ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోలైన ఓట్లతో కూడిన ఈవీఎంలు కౌంటింగ్ కేంద్రానికి తరలించి భద్రపరచేందుకు తీసుకోవలసిన చర్యలపై జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పోలింగ్ అనంతరం ఆయా నియోజకవర్గాల నుంచి ఈవీఎంలతో ఎన్ని వాహనాలు వస్తాయి? వాటికి ఏర్పాటు చేయవలసిన పార్కింగ్ గురించి అధికారులతో చర్చించారు. విశ్వవిద్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రదేశాలు పార్కింగ్ ప్రదేశాలుగా వినియోగించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలు, స్ట్రాంగ్ రూములు, అవసరమైన మార్గాలు, బారికేడింగ్ గురించి రూపొందించిన ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో కె. చంద్రశేఖరరావు, ఏఎస్పీలు జి. వెంకటేశ్వరరావు, ఎస్‌వీడీ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్డీవో ఎం. వాణి, ఏడీ సర్వే మనీషా త్రిపాఠి, జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ పంచాయతీరాజ్ ఎస్ఈ విజయ్ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

100 నిమిషాల్లో సమస్య పరిష్కారం

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ఫిర్యాదు పరిష్కార తీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై పౌరులు ఫిర్యాదులు చేసిన 100 నిమిషాల్లో పరిష్కరిస్తున్నామని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీ-విజిల్ ఫిర్యాదుల పరిశీలన కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ యాప్ ద్వారా అప్పుడే అందిన ఫిర్యాదును కలెక్టర్ పరిశీలించి దాని పరిష్కార విధానాన్ని గమనించారు. సీ-విజిల్ ఫిర్యాదు అందిన వెంటనే ఉల్లంఘన జరిగిన ప్రదేశంలో ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు సమాచారం అందించటం జరుగుతుందని ఆ టీమ్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ కలిగిన వాహనంలో బయలుదేరి ప్రదేశానికి చేరుకుని వెంటనే చర్యలు తీసుకుంటున్నారన్నారు. అలాగే 1950 కాల్‌సెంటర్, 24/7 కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్ 2525330 కు వచ్చిన ఫిర్యాదులు, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ విధంగా పరిష్కరిస్తున్నారో సిబ్బందిని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కార విభాగం నోడల్ అధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి జె. జ్యోతి పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికల్లో ఉపాధ్యాయులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో అధ్యక్షుడు బి. లంకేశ్వరరావు, కార్యదర్శి డీఈ అశోక్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ డీకే బాలాజీని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆరు నెలల్లోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మినహాయింపు ఉందని ఈ ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయులకు విధులు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కిడ్నీ, క్యాన్సర్, మోకాళ్ల మార్పిడి తదితర శస్త్రచికిత్స చేయించుకున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు, 40 శాతం పైన వికలాంగత్వం ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. విదేశాలకు వెళ్లడానికి ఎన్‌వోసీ తీసుకుని టికెట్లు కలిగిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.



శ్రీ క్రోధి.. స్వాగతం



ఉగాది పండుగ.. షడ్రుచుల సంగమం.. ఆరు రుతువుల ఆగమనం.. ఇది మనిషి జీవిత గమనం.. నిష్క్రమిస్తున్న 'శోభకృత్'కు నిండైన వదనంతో వీడ్కోలు పలుకుతూ.. రాబోయే కాలమంతా సుఖమయం కావాలని కొత్త సంవత్సరాదిని తెలుగు లోగిలి స్వాగతం పలుకుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అండతో ప్రతి గుమ్మం అభివృద్ధి తోరణంతో.. సంక్షేమాల ముగ్గులతో.. సంతోషాల పసుపు పూసుకొని ఆహ్వానం చెబుతోంది. క్రోధి తన పేరులా కాకుండా లోకహితంగా ఉండాలని అభిలషిస్తూ పండుగ జరుపుకునేందుకు ముస్తాబైంది. ఉగాది పచ్చడిని చేసుకొని కుటుంబమంతా రుచి చూడాలని ఏర్పాట్లు చేసుకుంది. దీంతో విజయవాడ వన్‌టౌన్‌లోని కాళేశ్వరరావు మార్కెట్ కళకళలాడింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలాజీ


వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తాగునీటి సరఫరా అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జిల్లాలో తీసుకున్న చర్యలను ఆయనకు వివరించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి రైవస్ కాలువకు 1000 క్యూసెక్కుల నీటిని వదిలారని, ఈ నీరు 72 కిలోమీటర్ల వరకు వచ్చాయని చెప్పారు. జిల్లాలోని బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను శివారు ప్రాంతాలకు మంగళవారం ఉదయానికి చేరుకుంటాయన్నారు. మొదటి ప్రాధాన్యత తాగునీటికి ఇస్తున్నామని సమ్మర్ స్టోరేజీ చెరువులను పూర్తిస్థాయిలో నింపుకొనేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. కాలువ గట్లపై లస్కర్లు, వీఆర్వోలతో బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచామని ఎట్టి పరిస్థితుల్లో నీరు అక్రమ వాడకం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చేపల చెరువలకు నీరు అక్రమంగా తరలిపోకుండా నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. కాలువల వెంబడి పవర్, ఆయిల్ ఇంజన్లను తొలగించాలని ఆదేశించామన్నారు. మే నెలలో నీటి ఎద్దడి తలెత్తకుండా సక్రమంగా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ టి.శివప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో ఆనంద్‌కుమార్, ట్రాన్స్‌కో ఈఈ ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించండి

సార్వత్రిక ఎన్నికలను సెక్టోరియల్ అధికారులు గురుతర బాధ్యతగా భావించి సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సోమవారం సాయంత్రం సెక్టోరియల్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల అధికారులకు నాణ్యత కలిగిన శిక్షణ చాలా ముఖ్యమన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సాంకేతికంగా ఎలా పనిచేస్తాయో, పోలింగ్ ఎలా చేయాలో స్వయంగా అవగాహన చేసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చే సమయంలో అన్ని నిబంధనలను తెలియపరచాలన్నారు. ఎన్నికల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వారికి అప్పగించిన విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు ఆ విషయం ఉన్నతాధికారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు మధ్య వారధిగా సెక్టోరియల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. శిక్షణ తరగతుల్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలి

- చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టండి
- అధికారులతో కలెక్టర్ డీకే బాలాజీ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకె బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కాలువల ద్వారా విడుదల చేసిన నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల ద్వారా విడుదల చేసిన నీటిని జిల్లాలోని అన్ని చెరువులను నింపేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు మండలాల్లో చెరువులు నింపేందుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కాలువ ద్వారా విడుదల చేసిన నీటిని మధ్యలో గండి కొట్టి ఆక్వా చెరువులకు వినియోగించకుండా పహారా బృందాలు గస్తీ నిర్వహించి అరికట్టాలన్నారు. ఎవరైనా నీటిని మళ్లించినట్లు తెలిస్తే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద చర్యలు చేపడతామని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపే బాధ్యత పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌దేనన్నారు. ఇప్పుడు చెరువులన్నీ నింపితే మే నెలాఖరు వరకు తాగునీటి సమస్య ఉండదన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడుబడిన బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో జాతీయ రహదారి వెంబడి ఉన్న పెట్రోల్ బంక్ వెనుక పాడుబడిన బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటం సోమవారం కలకలం రేపింది. తీవ్ర దుర్వాసన రావటంతో బావిలో శవం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వీరవల్లి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుని ఎడమ చేతిపై ఇంగ్లిషు అక్షరాలతో 'జెయుఎస్‌ఎల్' పచ్చబొట్టు ఉందని, ఎడమచేతి మణికట్టు వద్ద 'బి' అనే అక్షరంతో మరో పచ్చబొట్టు ఉందని వీరవల్లి ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వ్యక్తులు ఎస్‌ఐ ఫోన్ నంబర్ 94407 96445కు వివరాలు తెలియజేయాలని కోరారు.

ముగిసిన పది మూల్యాంకనం

చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతి పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారంతో ముగిసింది. ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు మూల్యాంకనం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నిర్మల హైస్కూల్‌లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశారు. లేడీ యాంప్తిల్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, ఒకేషనల్ సబ్జెక్టులు, నిర్మల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. ఈ మూల్యాంకనంలో మొత్తం 587 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు పాల్గొని 1,95,471 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. జవాబుపత్రాలకు సంబంధించి ఓఎంఆర్ షీట్లు, మార్కుల ప్రొఫార్మాను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు పంపారు. జవాబు పత్రాలను మచిలీపట్నం నగరంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఈ ప్రక్రియను డీఈవో తాహెరా సుల్తానా పర్యవేక్షించారు. మూల్యాంకన విధులకు హాజరైన సిబ్బందికి, విద్యాశాఖాధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి అభ్యర్థులను తరిమికొట్టాలి

- ఎన్నికల తర్వాత విజయవాడలో కనిపించరు
- సుజనా చౌదరి కేంద్ర మంత్రిగా ఉన్నా విజయవాడకు చేసింది శూన్యం
- ఎంపీ కేశినేని నాని ఫైర్


చిరు వ్యాపారితో ముచ్చటిస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి తరఫున విజయవాడ ఎంపీగా, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇద్దరూ పొలిటికల్ టూరిస్టులు అని విజయవాడ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విమర్శించారు. ఎన్నికల అనంతరం వారిద్దరూ విజయవాడలో కనిపించరని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని సోమవారం 37వ డివిజనులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రమణయ్య కూల్‌డ్రింక్ షాప్ సెంటర్ నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. కేటీరోడ్డు, సామారంగం చౌక్, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూలబావి వీధిలో ఉన్న జైన్ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి తరఫున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరూ మోసగాళ్లని మండిపడ్డారు. వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సుజనాచౌదరి 12 ఏళ్ల రాజ్యసభ సభ్యుడిగా, మూడేళ్ల కేంద్రమంత్రిగా ఉన్నా కూడా విజయవాడకు, రాష్ట్రానికి చేసిందేమీ లేదని చెప్పారు. ఆయన వ్యవహారాలు చక్కబెట్టుకోవడానికి చంద్రబాబుకు బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి నకిలీ ఎంపీ స్టిక్కర్లు వేసుకుని హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ దందా నడిపాడని తెలిపారు. ఆయన వందలాది మంది పేదల భూములు తీసుకుని మోసం చేయడంతో కేశినేని డెవలపర్స్ అనే సంస్థపై రియల్ ఎస్టేట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ భారీ జరిమానా కూడా విధించినట్లు మీడియాలో వచ్చిందని వివరించారు. తనపై చిన్న మచ్చ కూడా లేదని నాని స్పష్టం చేశారు. తన ఆస్తులను అమ్ముకుని నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని, ఎక్కడా అవినీతికి పాల్పడలేదని కేశినేని నాని చెప్పారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో స్థానికుడైన ఆసిఫ్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ నాన్ లోకల్ పెత్తందారులను పశ్చిమ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, నాయకులు జిలానీ, గ్రంధి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై...

భార్యను గొంతు పిసికి హత్య చేసిన భర్త


దేవి మృతదేహం

గుడివాడరూరల్: అనుమానమే పెను భూతమై భార్యను హత్య చేసిన దారుణ ఘటన ఆదివారం అర్ధరాత్రి కృష్ణా జిల్లా గుడివాడలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం .. గుడివాడ పట్టణంలోని దనియాలపేట చెరువుగట్టు సమీపంలో నివసిస్తున్న కల్లేపల్లి శంకరరావు, దేవి(32) దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శంకరరావు ఇస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య ఇళ్లల్లో పని చేస్తుంటుంది. ఈ క్రమంలో గత నెలరోజుల నుంచి భార్య ఎవరితోనో ఫోన్ మాట్లాడుతుండటంతో శంకరరావు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం జరిగింది. ఆ సమయంలో శంకరరావు క్షణికావేశంలో భార్యను పీక పిసికి చంపేశాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శంకరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం దేవి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి సోదరుడు నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లి హత్యకు గురవడం, తండ్రి పోలీసుల అదుపులో ఉండటంతో ఇద్దరు కుమార్తెలు అనాథలుగా మారారు.

రూ.10 లక్షల నగదు స్వాధీనం

తిరువూరు: తిరువూరు సమీపంలోని రాజుపేట సరిహద్దు చెక్‌పోస్టులో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.10 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు నుంచి తిరువూరుకు ద్విచక్రవాహనంపై తరలిస్తున్న రూ.9.79 లక్షల నగదును ఇరువురు వ్యక్తుల నుంచి స్వాధీనపరచుకున్నారు. ఆర్టీసీ బస్సులో విజయవాడ తరలిస్తున్న మరో రూ.85 వేల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపించాలని సీఐ అబ్దుల్‌నబీ తెలిపారు.













